పాఠశాలలో పరికరాలు ధ్వంసం



2



2

ప్రభుత్వ కాలేజీలకు మంచి రోజులు



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

**అక్షరటుడే ఇందూరు:** జాతీయ ఉపాధ్యాయ అవార్డుల కోసం జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో అశోక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అవార్డులు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన వివరించారు. దరఖాస్తు స్వీకరణ తేదీ ఈనెల 17 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. అర్హత ఉన్నవారు http://nationalawardstoteachers.education.gov.in/ వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.


14-7-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

**అక్షరటుడే, ఆర్మూర్:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తగ్గింది. మహారాష్ట్రతో పాటు, నిజామాబాద్ నిర్మల్ జిల్లాల్లో వర్షాలు కురవకపోవడంతో వరద నీరు తగ్గుముఖం పట్టింది.

### 2,172 క్యూసెక్కులు..

ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి 2,172 మేర ఇన్‌ఫ్లో వస్తోంది. ఆదివారం 3,653 క్యూసెక్కులు వచ్చింది. రోజురోజుకూ ఇన్‌ఫ్లో తగ్గుతూ వస్తోంది. ప్రాజెక్ట్‌లో 359 క్యూసెక్కులు ఆవిరి రూపంలో వెళ్లిపోతుంది. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు ఎగువన వర్షాలు పడకపోవడంతో ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 20.902 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 12.788 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

## ఆర్డీవో పార్థసింహారెడ్డి బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ఆర్డీవోగా పార్థసింహారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని చెప్పారు. రెవెన్యూ, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

## జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా మోహన్ రెడ్డి



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా మోహన్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు జిల్లా వ్యవసాయ అధికారిగా పనిచేసిన తిరుమల ప్రసాద్ నిజామాబాద్ ఆత్మ డైరెక్టగా బదిలీ అయ్యారు. వికారాబాద్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన మోహన్ రెడ్డికి పలువురు అధికారులు, టీఎన్జీవోస్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం బదిలీపై వెళ్లిన తిరుమల ప్రసాద్, మోహన్ రెడ్డిలు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్క అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.



# ఆపరేషన్ టైగర్

- పెద్దపులి కోసం రెండు రోజులుగా గాలింపు
- డ్రోన్స్, ట్రాక్ కెమెరాల ద్వారా సెర్చ్ ఆపరేషన్
- పులిపై విషప్రయోగం.. అధికారుల అదుపులో ముగ్గురు
- బతికే ఉందా చనిపోయిందా అనే అనుమానాలు
- భయాందోళనలో శివారు ప్రాంతాల ప్రజలు

**కామారెడ్డి జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. రెండు రోజులుగా అటవీశాఖ అధికారులు పెద్ద పులి జాడ కోసం రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నారు. డ్రోన్లు, ట్రాక్ కెమెరాలతో పులి జాడ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు పులిపై విషప్రయోగం జరిగిందన్న ప్రచారం ఫారెస్ట్ అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పులి బతికే ఉందా.. చనిపోయిందా అనే అనుమానాలు అధికారులను వెంటాడుతున్నాయి. పులి జాడ తెలిస్తే తప్ప అధికారులకు కంటిమీద కునుకు ఉండే అవకాశాలు లేవన్న ప్రచారం సాగుతోంది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

పెద్దపులి సంచారం విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు ఆదివారం ఉదయం నుంచి అడవిలో రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నారు. సిరికొండ, ఇందల్వాయి, కామారెడ్డి నుంచి మూడు బృందాలు పులికోసం అడవిని జల్లెడ పడుతున్నారు. అడవిలో ఆరు ట్రాక్ కెమెరాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం రెండు డ్రోన్ కెమెరాలతో అడవి మొత్తం గాలిస్తున్నారు.

### పులిపై విషప్రయోగం..?

రెడ్డిపేట తండాకు చెందిన మహిపాల్ అనే వ్యక్తి చెందిన ఆవుపై శనివారం సాయంత్రం పెద్దపులి దాడి చేసింది. దీంతో అతను ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. అధికారులు ఆదివారం ఉదయమే తండా ప్రాంతంలో పులి పాదముద్రలు సేకరించి పెద్దపులి సంచరిస్తున్నట్లుగా నిర్ధారించుకున్నారు. ఆవుపై ఈగలు



వాలి చనిపోవడంతో అనుమానం వచ్చి వైద్యుడితో పరీక్ష చేయించగా గుర్తు తెలియని మందు ఆవుపై చల్లినట్టుగా అనుమానం వ్యక్తం చేస్తూ మహిపాల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఆవుపై గడ్డి మందు చల్లినట్లుగా ఒప్పుకున్నట్టు అధికారులు తెలిపారు. మహిపాల్‌తో పాటు అతనికి సహకరించిన సంజీవులు, గోపాల్ అనే మరో ఇద్దరిని సైతం అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే ఆవుపై పులి మళ్లీ దాడి చేసిందా.. లేదా అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. ఒకవేళ ఆవుపై మళ్లీ దాడి చేస్తే విషప్రయోగం జరిగే అవకాశాలు ఉన్నాయి.

### చనిపోయిందా.. శివారు దాటిందా..?

పెద్ద పులి సంచరించిన ప్రాంతం మాచారెడ్డి రేంజ్ ఎల్లంపేట ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే పులిపై విషప్రయోగం జరిగిందనే ప్రచారంతో అసలు పులి బతికే ఉందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆవుపై పులి మరోసారి దాడి చేయకపోతే జిల్లా శివారు దాటి ఉండొచ్చన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. శివారు దాటితే మాత్రం అధికారులు ఊపిరి పీల్చుకునే అవకాశాలు ఉన్నాయి.

## భయంగా గడుపుతున్నాం



మా ఇల్లు అడవికి ఆనుకుని ఉంటుంది. రెండు రోజులుగా పులి సంచారంతో భయంగా గడుపుతున్నాం. వ్యవసాయ పనులకు వెళ్లలేక పోతున్నాం. రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. అధికారులు స్పందించి పులిని పట్టుకోవాలి. **– సలావత్ లింగ్యా, స్కూల్ తండా**

## మేకల కాపలాకు వెళ్లడం లేదు



ప్రతిరోజూ అడవిలోకి మేకలు, ఆవులు మేపడానికి వెళతాం. రెండు రోజుల నుంచి వెళ్లాలంటే పులి ఎక్కడ దాడి చేస్తుందోనని భయపడుతున్నాం. ఇప్పటికే రెండు ఆవులను చంపింది. తండాకు దగ్గర వరకు పులి వచ్చింది. ఇళ్లపైకి వస్తే మా పరిస్థితి ఏంటి.. అధికారులు రెండు రోజుల నుంచి పులికోసం వెతుకుతున్నారు. త్వరగా పులి జాడ తెలుసుకోవాలి.

**– గంగావత్ సేవ్య, స్కూల్ తండా**

## రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది



పెద్దపులి ఆవుపై దాడి చేసిందని సమాచారం రాగానే మా అధికారులు, సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. వారం రోజుల క్రితమే సిరికొండ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్టుగా పాదముద్రలు బయటపడడంతో అన్ని ఏరియా అధికారులను అప్రమత్తం చేశాం. ప్రస్తుతం మూడు బృందాలు పెద్దపులి కోసం వెతుకుతున్నాయి. ఇప్పటికే పులిని గుర్తించేందుకు ఆరు ట్రాక్ కెమెరాలను అమర్చాం. రెండు డ్రోన్ కెమెరాలతో సెర్చ్ చేస్తున్నాం. పులిపై విషప్రయోగం జరిగిందనేది స్పష్టంగా చెప్పలేం. ఆవుపై మందు చల్లానని మహిపాల్ అనే వ్యక్తి ఒప్పుకున్నాడు. శాంపిల్ సేకరించి ఫోరెన్సిక్ కు పంపించాం. పులికి ఏమి జరిగి ఉండదని భావిస్తున్నాం. గత 4050 ఏళ్లుగా జిల్లాలో పెద్దపులి సంచారం లేదు. చిరుతలు, ఎలుగుబంట్లు మాత్రమే ఉన్నాయి. పెద్దపులి వస్తే దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. ప్రజలెవరూ అడవి వైపు వెళ్లొద్దని సమాచారం తెలియజేశాం. పులి కనిపిస్తే మాకు సమాచారం ఇవ్వాలి. **– నిఖిత, డీఎఫ్‌వో, కామారెడ్డి**

## తెయూ స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వీసీ యాదగిరి రావు

**అక్షరటుడే, ఇందల్వాయి:** తెయూలో ఈనెల 16న నిర్వహించనున్న రెండో స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయాలని వర్సిటీ వీసీ యాదగిరి రావు అన్నారు. ఈ మేరకు వర్సిటీ కామర్స్ సెమినార్ హాల్‌లో రిజిస్ట్రార్ ఎం యాదగిరి, కంట్రోలర్ కె.సంపత్ కుమార్‌తో కలిసి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2006లో 6 విభాగాలతో ప్రారంభమైన వర్సిటీ నేడు 24 విభాగాలతో 31 కోర్సులకు విస్తరించిందన్నారు. భిక్కనూరు పీజీ సెంటర్, సారంగపూర్‌లో ఎడ్యుకేషన్ కళాశాలతోపాటు జిల్లావ్యాప్తంగా 109 అనుబంధ కళాశాలలు ఉన్నాయన్నారు. స్నాతకోత్సవంలో 16 విభాగాల నుంచి మొదటి ర్యాంకు సాధించిన 130 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్లు, జూన్ 30, 2025 వరకు ఏడు విభాగాలల్లో పరిశోధనలు చేసిన సుమారు 156 మంది పరిశోధక విద్యార్థులకు పట్టాలు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందించనున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా ఐఐసీఈ మాజీ డైరెక్టర్ చంద్రశేఖర్ హాజరు కానున్నట్లు వెల్లడించారు.

## విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** విద్యార్థులు లక్ష్యాన్ని ముందే నిర్దేశించుకుని అందుకోసం కష్టపడాలని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. రుద్రూర్ మండలం అంబెం గ్రామంలోని ఆదర్శ పాఠశాల, బాలికల హాస్టల్, వర్ని కేజీబీవీలను సోమవారం తనిఖీ చేశారు. అలాగే వర్నిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను, కోటయ్య క్యాంప్ గ్రామంలో ఎస్సీ బాలికల వసతి గృహం, ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. వంట గది, సరుకుల నిల్వ గదులను తనిఖీ చేసి, సరుకులు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని వడ్డిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, విద్యా బోధనతో పాటు ఆహారాన్ని నాణ్యతగా అందించాలని సూచించారు. ఆయన వెంట ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, వర్ని మార్కెట్ కమిటీ ఛైర్మన్ సురేష్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతు కుటుంబానికి అండగా ఉంటా



**అక్షరటుడే గాంధారి:** విద్యుదాఘాతంతో మృతి చెందిన కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకుంటానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని ముదెల్లి గ్రామంలో మృతి చెందిన కౌలురైతు కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ట్రాన్స్‌కో డీఈతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే రూ. 5లక్షల నష్ట పరిహారం అందేవిధంగా చూడాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారంతో పాటు ఉద్యోగం, ఇల్లు నిర్మాణానికి సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కాగుల మోహన్ యాదవ్, పెద్దకాపు దేశని సాయిలు, వడ్డే రాజయ్య, బల్గురి రాజు, కిరణ్ గౌడ్, పల్లె కాశీరాం, కర్రొల్ల సాయిలు, పోకల రాము తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

## ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లతో పాటు మెప్మా పీడీ రాజేందర్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్‌లకు అర్జీలు సమర్పించారు. కాగా.. ప్రజావాణికి 94 ఫిర్యాదులు అందాయి.



పోలీస్ ప్రజావాణిలో సీపీకి తమ సమస్యలు చెప్పుకుంటున్న ప్రజలు

### పోలీస్ ప్రజావాణికి 26 ఫిర్యాదులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాకేంద్రంలోని సీపీ కార్యాలయంలో సీపీ సాయిచైతన్య ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 28 మంది ఫిర్యాదుదారులు రాగా, సంబంధిత స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, సీఐలకు ఫోన్ చేసి కేసు స్థితిగతులు తెలుసుకున్నారు. అర్జీల తక్షణ పరిష్కారానికి తగు సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, నేరుగా తనను సంప్రదించి ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రజావాణి చేపట్టినట్లు పేర్కొన్నారు.

## అంకిత భావంతో విధులు నిర్వహించాలి

**అక్షరటుడే, లింగంపేట:** పోలీస్ సిబ్బంది విధులను అంకితభావంతో నిర్వహించాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. లింగంపేట పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పెండింగ్ కేసులను పరిశీలించారు. సిబ్బంది విధులపై సమాచారం సేకరించారు. అనంతరం వారితో మాట్లాడారు.

### సిబ్బంది ప్రజలతో మమేకం కావాలి

పోలీస్ సిబ్బంది ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని ఎస్పీ సూచించారు. ఒక్కో గ్రామాన్ని ఒక్కో పోలీసు సిబ్బంది దత్తత తీసుకుని శాంతిభద్రతల పర్యవేక్షణ నిర్వహించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మైనర్లకు ఎట్టిపరిస్థితుల్లో వాహనాలు ఇవ్వవద్దని, వారికి వాహనాలిస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీస్ సిబ్బంది సమానమని, ప్రతి వ్యాపార సముదాయంలో, గ్రామాల్లో, ప్రయాణ ప్రాంగణాలు, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. సీసీ కెమెరా కనబడితే అప్రమత్తంగా ఉంటారని, దొంగతనాల నివారణకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట సీఐ రాజారెడ్డి, ఎస్సై దీపక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రాజేష్ చంద్ర

## బీసీల ధర్నాను విజయవంతం చేయాలి



**అక్షరటుడే, నిజాంసాగర్:** హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన బీసీల ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని తన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 15న ఉదయం 10 గంటల నుంచి హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాకు బీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా తరలిరావాలన్నారు. జుక్కల్, పిట్లం, మహమ్మద్ నగర్, నిజాంసాగర్, పెద్ద కొడప్‌గల్, బిచ్కుంద, మద్నూర్, డోంగ్లీ అన్ని మండలం మాజీ ప్రజాప్రతినిధులు మాజీ ఛైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు ఎంపీటీసీలు, సర్పంచులు ఉప సర్పంచులు డైరెక్టర్లు వార్డ్ మెంబర్లు, బీసీ ముఖ్య నాయకులందరూ తప్పనిసరిగా ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం రైతుల ధర్నా



**అక్షరటుడే, కామారెడ్డి:** ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పది రోజులవుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో సోమవారం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పది రోజులు గడుస్తున్నా అధికారులు మరమ్మతులు చేయడం లేదన్నారు. కాలిపోయిన దాని స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని సంబంధిత ఏఈ, డీఈలకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**స్పందించిన అధికారులు:** ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయిన సమాచారం అందుకుని కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. సమస్య వచ్చిన 48 గంటల్లో పరిష్కరించామని.. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

## ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం



**అక్షరటుడే, ఆర్మూర్:** ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన మాక్లూర్ మండలం విద్యార్థులను ఘనంగా సన్మానించారు. మామిడిపల్లి ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు నూనె హర్షిత, పాల్దె రిషి, యశస్వి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం మామిడిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ, స్కూల్ ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గంగోనీ సంతోష్, క్యాషియర్ శ్రీనివాస్, హెచ్‌ఎం బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**అక్షరటుడే,బోధన్:** యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని బోధన్ సీఐ వెంకట్ నారాయణ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## అమర్‌నాథ్ యాత్రికులకు మెడికల్ కిట్ల పంపిణీ



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ నుంచి మంగళవారం అమర్‌నాథ్, మానస సరోవరం యాత్రకు వెళ్తున్న పలువురికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. భక్తులు సుధాకర్ యాదవ్, గుడికొండ సుభాష్, దారం నాగరాజు, సాహెబ్ రావుకు బీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సీతాలే రమేష్, కోశాధికారి మేకల పెద్ద గాలయ్య మెడికల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం బీర్కూర్ నుంచి శబరిమల మహా పాదయాత్రకు బయలుదేరి వెళ్లే అయ్యప్ప భక్తులకు మెడికల్ కిట్లను పంపిణి చేస్తున్నామని తెలిపారు. ఈసారి అమర్‌నాథ్, మానస సరోవరం యాత్రకు వెళ్తున్న శివ భక్తులకు మెడికల్ కిట్లను పంపిణి చేసినట్లు తెలిపారు. యాత్రకు వెళ్తున్న భక్తులు క్షేమంగా వెళ్లి పరమేశ్వరుణ్ణి దర్శించుకుని రావాలని ఆకాంక్షించారు.

## ఆర్‌ఎంపీ వైద్యుడి ఆత్మహత్య

**అక్షరటుడే, బిచ్కుంద :** కుటుంబ కలహాలతో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జుక్కల్ మండలం మహమ్మదాబాద్‌లో జరిగింది. ఎస్సై నవీన్ చంద్ర కథనం ప్రకారం.. వేల్పూర్ మండలానికి చెందిన మోరె గణేశ్ (38) కొన్నేళ్ల కిందట మహమ్మదాబాద్‌కు వచ్చి ఆర్‌ఎంపీ వైద్యుడిగా స్థిరపడ్డాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో భార్యభార్తల మధ్య ఇటీవల గొడవ జరగడంతో భార్య బోధన్‌లోని తన కొడుకు వద్దకు వెళ్లింది. సోమవారం గణేశ్‌కు ఫోన్ చేయగా.. ఎంతకీ స్పందించలేదు.

దీంతో గ్రామంలోని గణేశ్ మిత్రుడైన దేవిదాస్‌కు ఫోన్ చేయగా.. ఆయన ఇంటికి వెళ్లి చూశాడు. కాగా.. అప్పటికే గణేశ్ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచానామా చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా విస్తృతంగా ప్రచారం చేశారు. కళాశాలల్లో అధ్యాపక పోస్టుల భర్తీ, వసతుల కల్పన, విద్యార్థుల చేరికపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో జిల్లాలోని ప్రభుత్వ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు ఫస్టియర్‌లో 3,100 మందికి పైగా అడ్మిషన్ పొందారు. గతేడాది 2,506 మంది మాత్రమే చేరగా, ఈసారి 600పైగా అడ్మిషన్లు పెరిగాయి. ఇంకా పెరిగే అవకాశం ఉందని అధ్యాపకులు చెబుతున్నారు.

– అక్షర టుడే, నిజాంసాగర్

# ప్రభుత్వ కళాశాలలకు మంచి రోజులు



- జిల్లాలో పెరిగిన అడ్మిషన్లు
- ఫలితమిస్తున్న అధ్యాపకుల కృషి
- ఫస్టియర్‌లో 3,100 మందికి పైగా చేరిక

జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో వివిధ కోర్సుల్లో ఇప్పటివరకు 2,690 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 412 మంది విద్యార్థులు చేరారు. గతంలో మౌలిక వసతులు లేక, లెక్చరర్ల కొరతతో అడ్మిషన్లు తక్కువగా అయ్యేవి. ఈసారి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టడంతో ప్రవేశాలు పెరిగాయి. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, వారి తల్లిదండ్రులకు కళాశాలల్లో వసతులు, ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు వంటి.. వసతులను వివరించారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు ముందుకొచ్చారు. బాన్సువాడ, బాన్సువాడ గర్ల్స్ జూనియర్ కళాశాలలో జిల్లాలోనే అధికంగా అడ్మిషన్లు జరిగాయి. 445 మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందారు. బాన్సువాడ జూనియర్ కాలేజీలో 355 మంది ప్రవేశాలు, కామారెడ్డి జూనియర్ కాలేజీలో సోమవారం నాటికి 436 అడ్మిషన్లు జరిగాయి. ఇక, జిల్లాలోని వివిధ కళాశాలల్లో సోమవారం నాటికి బిచ్కుందలో 234, లింగంపేటలో 166, దోమకొండలో 146, జుక్కల్‌లో 129, ఎల్లారెడ్డిలో 125, మద్నూర్‌లో 123, గాంధారిలో 117, పిట్లంలో 108, రామారెడ్డిలో 99, బీర్కూర్‌లో 91, సదాశివనగర్‌లో 88, మాచారెడ్డిలో 84, భిక్కనూరులో 82, బీబీపేటలో 78, నాగిరెడ్డిపేటలో 75, తాడ్వాయిలో 68, నిజాంసాగర్‌లో 51 అడ్మిషన్లు అయ్యాయి.

జూనియర్ కాలేజీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.3.28 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో అవసరమైన చోట్ల తరగతి గదులు, మూత్రశాలలు నిర్మించి, ఫర్నిచర్ అందుబాటులోకి తేనున్నారు. జిల్లాలో కొత్తగా 59 లెక్చరర్ పోస్టులు భర్తీ అయ్యాయి. ప్రస్తుతం రెగ్యులర్ లెక్చరర్లు 243, గెస్ట్ లెక్చరర్లు 58 మంది ఉన్నారు. నిజాంసాగర్, బీబీపేట, నాగిరెడ్డిపేట, బీర్కూర్‌లో గెస్ట్ లెక్చరర్లను నియమించారు.

### ఉత్తమ ఫలితాలు సాధిస్తాం..



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఈ సారి అత్యుత్తమ ఫలితాలు సాధిస్తాం. అన్ని కళాశాలల్లో సరిపడా అధ్యాపకులను నియమించాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– షేక్ సలాం, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి

## ఈవ్ టీజింగ్ చేస్తే షీటీంకు సమాచారమివ్వాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** మహిళలు వేధింపులకు గురయితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని షీటీం సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని ఇస్సాపల్లి ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులకు షీటీం కానిస్టేబుళ్లు విగ్నేష్, సుమతి అవగాహన కల్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినులు, ఉద్యోగినులు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే పోలీస్ శాఖ వారికి అండగా ఉంటుందన్నారు. సమాచారం ఇచ్చిన మహిళలు, విద్యార్థినుల పేర్లు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈవ్ టీజింగ్‌కు గురయ్యేవారు భయపడకుండా సమాచారం ఇస్తే రక్షణ కల్పిస్తామన్నారు. షీటీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా షీటీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జగదీశ్వర్, ఉపాధ్యాయులు, కృష్ణారెడ్డి, అరుంధతి, చిన్నయ్య, కృష్ణ చైతన్య, రాజేశ్ విద్యార్థినులు పాల్గొన్నారు.



## గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు



**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం మండల కేంద్రంలోని గద్ద గుండు తండాలో గణపతి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పిట్లంకు చెందిన భక్తుడు నాగరాజు ఆధ్వర్యంలో ఆలయంలో అభిషేకాలు తీర్థప్రసాదం అందజేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బడుగు బలహీన వర్గాలకు అన్యాయం

**అక్షరటుడే, ఇందూరు:** బాసర ట్రిపుల్ ఐటీ సీట్ల కేటాయింపులో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బడుగు బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటగిరీల వారీగా ట్రిపుల్ ఐటీ బాసరలో ప్రకటించిన కటాఫ్ మార్కులు ఓసీలకే తక్కువగా ఉన్నాయన్నారు.

**అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో..**

ఈడబ్ల్యూఎస్ ఓసీలకు కట్ ఆఫ్ మార్కులు కేవలం 564 కాగా.. బీసీ (ఏ) విద్యార్థులకు 571, బీసీ (బి) 578, బీసీ(సీ)566, బీసీ (డి)579, ఎస్సీ విద్యార్థులకు 566, ఎస్టీ విద్యార్థులకు 569 గా ఉన్నాయన్నారు. అగ్రవర్ణాల విద్యార్థులకు ఈడబ్ల్యూఎస్ పేరుతో కేవలం 564 మార్కులు ఉండడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు అర్హులైన కూడా ఈడబ్ల్యూఎస్ వల్ల తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.



**అంతా ఏకతాటిపైకి రావాలి**

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలు ఏకతాటిపై వచ్చి పోరాడాలన్నారు. బహుజన, మైనారిటీ, విద్యార్థి, యువజన, సంక్షేమ, ఉద్యోగ సంఘాలు రంగంలోకి దిగి భవిష్యత్తు తరాలకు అన్యాయం జరగకుండా పోరాడాలని పిలుపునిచ్చారు. అయితే తాము నిజమైన అగ్రవర్ణ పేదలకు వ్యతిరేకం కాదన్నారు. నిజంగా నిరుపేద అగ్రవర్ణాలు ఎంత ఉన్నారో సర్వే చేసి.. వారికి మూడు శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలిపారు. సమావేశంలో నాయకులు బుస్సా ఆంజనేయులు, గంగా కిషన్, దేవేందర్, శంకర్, విజయ్, బాలన్న, సదానంద తదితరులు పాల్గొన్నారు.


## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** సీజనల్ వ్యాధులు ప్రబలే సమయం కావడంతో పారిశుధ్య కార్మికులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యలపై ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 100 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.

## బైక్‌పై నుంచి పడి ఒకరి మృతి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** బైక్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి.. ఒడ్డేపల్లి రంజిత్ (30) దుబాయ్‌లో పనిచేస్తుండగా, ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా ఘన్‌పూర్ సమీపంలో అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా.. రంజిత్ వివాహం కోసం వారం కిందటే దుబాయ్ నుంచి రాగా, అంతలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



## పాఠశాలలో విద్యుత్ పరికరాలు ధ్వంసం

పోతంగల్ మండలం జల్లపల్లి ఫారం ఉర్దూ మీడియం పాఠశాలలో పోకిరీలు హంగామా సృష్టించారు. వరుసగా శని, ఆదివారాలు సెలవులు రావడంతో పాఠశాల గదుల తాళాలు ధ్వంసం చేశారు. గదుల్లోని సీలింగ్ ఫ్యాన్లు, వాటర్ బోర్ కేబుళ్లు, ట్యూబ్ లైట్లు ధ్వంసం చేశారు. దీంతో ప్రధానోపాధ్యాయుడు సాయి కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. - అక్షరటుడే, కోటగిరి

## రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం మండల కేంద్రంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు బాన్సువాడ ట్రాన్స్‌కో డీఈఈ ప్రభాకర్ తెలిపారు. ఈనెల 15న (మంగళవారం) 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పరిష్కార వేదిక ఉంటుందని వివరించారు. కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ నారాయణ టెక్నికల్ మెంబర్ ఎస్.రామకృష్ణ, సీజీఆర్ఎఫ్ కమిటీ మెంబర్స్‌కు సమస్యలు చెప్పవచ్చన్నారు. నిజాంసాగర్, పిట్లం, పెద్ద కొడప్‌గల్ మండలాల విద్యుత్ వినియోగదారులు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం కల్లడి గ్రామంలో ఆరుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం బీజేపీ సీనియర్ నాయకులు గంగోల్ల ప్రళయ్ తేజ్ దరఖాస్తుదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గంగోల్ల ప్రళయ్ తేజ్, నాగేష్, అరుణ్, అశోక్, నరేందర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

